



నరసరావుపేట లింగంగుంట్ల కాలనీలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

- అక్రమాలపై దృష్టి సారించిన ప్రభుత్వం
- పరిశీలనకు సెర్ప్ ప్రత్యేక మొబైల్ యాప్
- పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక సచివాలయం ఎంపిక
- మండలానికి వెలుపల అధికారుల బృందంతో క్షేత్రస్థాయిలో తనిఖీ
- గ్రామాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ
- సోమ, మంగళవారాల్లో తనిఖీ.. 10న ప్రభుత్వానికి నివేదిక





# పింఛన్ల.. పరిశీలన

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పింఛను అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల విషయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వెలుగు చూసిన అక్రమాలను పరిశీలించి, ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాకో సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని, ఆ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి పింఛనుదారులను స్వయంగా అధికారులు పరిశీలించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఈ తనిఖీలు పూర్తి చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

**సెర్ప్ ఆధ్వర్యంలో పరిశీలన**

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో పింఛన్ల పరిశీలన చేపట్టనున్నారు. అందుకోసం సెర్ప్ ఒక మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించింది. తనిఖీ చేసే అధికారుల బృందాన్ని సెర్ప్ నిర్ణయిస్తుంది. ఏ మండల పరిధిలో ఏ సచివాలయంలో తనిఖీలు జరుగుతాయో ఆ సచివాలయ పరిధిలోని ఉద్యోగులను ఈ బృందంలో సభ్యులుగా నియమించరు. ఆ మండలానికి వెలుపల ఉండే ఉద్యోగులతోనే బృందాన్ని ఏర్పాటు చేస్తారు. ఒక్కో బృందం 40 మంది పింఛనుదారుల వివరాలను పరిశీలించాలి. బృందాలు పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను సెర్ప్ రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ అధికారులుగా ఉంటారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కూడా నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. నివేదికను ఈ నెల 10న ప్రభుత్వానికి అందజేస్తారు. ఈ పరిశీలనలో అనర్హులుగా గుర్తించిన వారికి జనవరి నుంచి పింఛను రాదు. తొలగించిన ప్రతి ఒక్క పింఛనుదారుడికి వారి పింఛను తొలగింపునకు సంబంధించిన కారణాన్ని తెలుపుతూ వారికి ఒక అక్నాలెడ్జ్‌మెంటు లెటర్ వస్తుంది. ఆ లెటర్ అందుకున్న వారిలో అర్హులు ఉంటే వారు సంబంధిత సచివాలయంలో అర్హతా పత్రాలు సమర్పిస్తే, అధికారులు వాటిని పరిశీలించి పింఛన్‌ను పునరుద్ధరించే అవకాశం ఉంది.

**● వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా..**

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్లు మంజూరు చేశారు. నిజమైన అర్హులను అనర్హులుగా పేర్కొని, వారిని తొలగించి, అనర్హులను పింఛనుదారులుగా నమోదు చేసి వారికి పింఛన్లు అందజేశారు. ప్రధానంగా దివ్యాంగ పింఛన్ల విషయంలో ఈ అక్రమాలు అంతులేకుండా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇష్టమొచ్చినట్లుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడంతో అర్హులకు అందాల్సిన పింఛన్లను వైసీపీ అనుయాయులు కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అక్రమాలన్నీ వెలుగులోకి వచ్చాయి. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో స్వయంగా స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులను చూసి ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. అనేకమంది అనర్హులు పింఛన్లు తీసుకోవడం గమనించిన ప్రజాప్రతి నిధులు ప్రభుత్వానికి ఈ విషయాన్ని నివేదించారు. ఈ క్రమంలో తాజాగా పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక గ్రామ/వార్డు సచివాలయంలో తనిఖీలు నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లాలో చేబ్రోలు మండలం వేజెండ్లలోని సచివాలయ పరిధిలోని పింఛనుదారుల వివరాలను పరిశీలించనున్నారు.

**కొత్త పింఛన్లు ఎప్పుడు?**

పాత పింఛన్ల తనిఖీల మాటెలా ఉన్నా జిల్లాలో కొత్త పింఛన్ల మంజూరు కోసం ఎదురు చూసే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూ ఉంది. దానికి తోడు కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల ప్రక్రియకు సంబంధించి అనేక వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుందన్న ఊహాగానాలు వస్తున్నాయి. ఈ నెల 15న ప్రక్రియను ప్రారంభించి వచ్చే నెల సంక్రాంతి నుంచి పింఛన్లు అందజేస్తారన్న వార్తలు వినిపిస్తుండడంతో లబ్ధిదారుల్లో హడావుడి పెరిగింది.



వినుకొండ: నిర్మాణాలు పూర్తయినా మౌలిక వసతులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న గృహాలు

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని గత వైసీపీ పాలకులు ప్రకటనలతో సరిపెట్టారు. పదుల ఎకరాల్లో వందల్లో లేఅవుట్లు వేసి వేలల్లో ఇళ్లు మంజూరు చేయగా అరకొరగానే ఇళ్లు పూర్తి అయ్యాయి. మొండిగోడలు, పిచ్చిమొక్కలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. పేరుగొప్ప ఊరుదిబ్బ అనుచందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. చాలావరకు ఇళ్లు పునాదుల దశకే పరిమితమయ్యాయి. కాలనీలకు రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ, తాగునీరు తదితర కనీస సౌకర్యాలు కల్పన చేయకుండా.. వాటికి సంబంధించి ఆలోచన చేయకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటూ లబ్ధిదారులను పరుగులు పెట్టించింది. దీంతో కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకోగా కనీస మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నివాసానికి లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. నాటి పాలకులు కాలనీలు కాదు ఊళ్లు అని ప్రకటించగా.. ఐదేళ్లకు అవి చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టిన వెంటనే కాలనీల్లోని పేదల ఇళ్లపై దృష్టి సారించింది. ఇళ్ల నిర్మాణాలకు లక్ష్యాలు నిర్దేశించింది. దీంతో కొన్నిప్రాంతాల్లో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

# కాలనీలు.. పునాదుల్లోనే

ఆంధ్రజ్యోతి ఫోకస్

- పేరుగొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు
- మౌలిక వసతుల కల్పనలో గత పాలకుల అలసత్వం
- ఈ నెలాఖరుకు ఇళ్లు పూర్తికి కూటమి ప్రభుత్వం లక్ష్యం
- సొంతంగా నిర్మించుకున్నా నివాసయోగ్యంగా లేని వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కాలనీ ప్రాంగణాలు
- కాలనీల పేరుతో హడావుడికే పరిమితమైన గత ప్రభుత్వం

(నరసరావుపేట, న్యూస్‌నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

పేరు గొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పేరుతో కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అయితే నాలుగేళ్ల పాటు హడావుడికే పరిమితం కాగా ప్రస్తుతం పలు కాలనీల్లో ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. కొన్ని దగ్గర్ల ఇళ్లు మొండిగోడలతో కనిపిస్తున్నాయి. ఊర్లకు దూరంగా కాలనీలు ఏర్పాటు చేసింది. పైగా ప్రభుత్వం తొలుత ప్రకటించినట్లు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఆ భారం లబ్ధిదారులపైనే వేయడంతో ఊర్లకు దూరంగా ఉన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుందని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన

(మిగతా 7వ పేజీలో..)

**ప్రభుత్వ సహకారం..**

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం ప్రారంభించి ఆర్థిక ఇక్కట్లతో అర్ధంతరంగా ఆపేసిన వారికి సహకారం అందించి ఇళ్లు పూర్తి చేసేలా చూడాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశాలను సైతం కూటమి ప్రభుత్వం ఇచ్చింది. గత ప్రభుత్వంలో లేఅవుట్లలో ప్లాట్ పొంది ఇంటి నిర్మాణం ప్రారంభించని వారి విషయంలో ప్రభుత్వం అంతర్గతంగా విచారణ జరుపుతుంది. ఇక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులకు సంబంధించి అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ నిధులపై ఇప్పటికే కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చింది. త్వరలోనే వీటిని మంజూరు చేసి ఆయా కాలనీలను నివాసయోగ్యంగా మార్చేందుకు సిద్ధమైంది.

| నియోజకవర్గం | మంజూరు | పూర్తి |
|---|---|---|
| నరసరావుపేట | 6,026 | 1,732 |
| చిలకలూరిపేట | 4,074 | 1,462 |
| వినుకొండ | 5,706 | 2,455 |
| మాచర్ల | 4,814 | 871 |
| గురజాల | 5,613 | 3,163 |
| సత్తెనపల్లి | 4,700 | 2,455 |
| పెదకూరపాడు | 8,693 | 2,995 |

**పల్నాడులో.. 38.18 శాతమే**

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 224 కాలనీల లేఅవుట్లను వేశారు. ఇందులో 36,626 గృహాలు మంజూరయ్యాయి. 36,626 గృహాలు నిర్మించాలని వైసీపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. లక్ష్యాలను చేరుకోవడంలో చతికిల పడింది. ఇళ్ల నిర్మాణాలను నత్తనడకన సాగాయి. ఇప్పటికి 15,133 గృహాల నిర్మాణం పూర్తయినట్లు గృహ నిర్మాణ శాఖ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 20,467 గృహాలు పునాదుల్లోనే నిలిచిపోయాయి. 10,349 గృహాల నిర్మాణం పునాదుల దిగువ స్థాయిలోనే నిలిచిపోయాయి. పునాదుల స్థాయిలో 10,118 గృహాలు ఉండగా శ్లాబ్ స్థాయిలో 1,942, శ్లాబ్ పూర్తయినవి 2,069 గృహాలు ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి 38.18 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయింది. డిసెంబరు నెలాఖరుకు జిల్లాలో 4,870 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. లక్ష్యాలు చేరుకునేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇళ్లకు నిధుల సమస్య లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం వేగవంతం అయ్యే అవకాశాలున్నాయి. నరసరావుపేటలో ఉప్పలపాడు, లింగంగుంట్ల, టిడ్కో గృహాల ప్రాంతంలోని మూడు కాలనీల్లో 6,026 ఇళ్లు మంజూరు కాగా 1,732 ఇళ్ల నిర్మాణం పూర్తయాయి. వినుకొండ పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలోని జాలలపాలెం సమీపంలో సుమారు 120 ఎకరాల్లో వేసిన జగనన్న లేఅవుట్‌లో 5200 మందికి ఇళ్లను మంజూరు చేశారు. వెయ్యిలోపు ఇంటి నిర్మణాలను చేపట్టినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లు సుమారు 500 వరకు ఇంటి నిర్మణాలను పూర్తిచేశారు. త్రీ ఫేస్ విద్యుత్‌కు సుమారు రూ.30 లక్షల వరకు బకాయిలు ఉండడంతో అధికారులు విద్యుత్ సర్వీసులను తొలగించారు. పిడుగురాళ్ల సమీపంలోని లెనిన్‌నగర్, ఆదర్శనగర్, సీతారాంపురం జగనన్న కాలనీల్లో 2,288 గృహాలు గృహాలుగా మంజూరు కాగా నేటి వరకు 800 గృహాలు మాత్రమే శ్లాబు స్థాయికి చేరాయి. ఈ కాలనీ ప్రాంగణాల్లో విద్యుత్, మంచినీటి ట్యాంక్‌లకు రూ.82 లక్షలకు పైగా ఖర్చుచేశారు. మాచర్లలో సుమారు 5110 మంది లబ్ధిదారులను గుర్తించి రెంటగుట్ట, బ్రహ్మానాయుడు చెరువు, నల్లబ్రిడ్జి, టిడ్కో గృహాల సమీపంలోని 21 లేఅవుట్లలో ఇళ్లు మంజూరు చేశారు. అయితే 150 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. వెల్దుర్తి మండల పరిధిలో కాలనీలు చిట్టడవులను తలపిస్తున్నాయి.



పిడుగురాళ్ల ఆదర్శ కాలనీలో అధ్వానంగా వున్న రహదారి



మాచర్ల: బేసుమట్టంలోనే నిలిచిన రెంటగుట్టలోని జగనన్న కాలనీ



పునాదులకే పరిమితమైన గురజాల జగనన్న కాలనీలలోని గృహాలు



7

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆశీస్సులు అందజేస్తున్న చర్చి ఫాదర్‌లు

**నేను ఆడుకున్న నేల ఇది**
రావిపాడు అమలోద్భవి మాత ఉత్సవాల్లో కేంద్రమంత్రి పెమ్మసాని

గుంటూరు మీదగా
**మరిన్ని శబరి ప్రత్యేక రైళ్లు**

నాగమ్మ దేవాలయం
**పునర్నిర్మాణానికి చర్యలు**
టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

వివాహేతర సంబంధం నేపథ్యంలో
**మహిళ హత్య**

అప్పుల బాధ తాళలేక
**రైతు ఆత్మహత్య**

# అతివేగంతో.. అనంతలోకాలకు

పిడుగురాళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అతి వేగం.. నలుగురిని బలితీసుకోగా, మరో నలుగురిని తీవ్రంగా గాయపరిచింది. వంద కిలోమీటర్లకు పైగా వేగంతో వస్తున్న కారు అదుపుతప్పి.. హైవేపై ఉన్న హెచ్చరిక బోర్డును ఢీకొట్టి.. ఆ తర్వాత చెట్టును ఢీకొట్టింది. నేరుగా చెట్టును ఢీకొట్టి ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగేదని పోలీసులు గుర్తించారు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా చెట్టు నుంచి కారును ఎక్స్‌కవేటర్ సాయంతో పక్కకు తొలగించాల్సి వచ్చింది. ఈ ప్రమాదానికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు.. నెల్లూరు జిల్లా కావలి రూరల్ పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉప్పాళ్ల ప్రణయ్‌కుమార్ ఇటీవల కారును కొనుగోలు చేశారు. అదే గ్రామానికి చెందిన తుళ్లూరి సురేష్(35), ఉప్పాళ్ల యోబులు(65), కావలికి చెందిన తాతా పెద్దతిరుపతి(60) ఆంజనేయస్వామి మాల ధరించారు. ఈ క్రమంలో కొత్త కారుకు పూజలు చేయించుకోవాలని ప్రణయ్‌కుమార్ తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి బయల్దేరారు. దీంతో ఆయన కారులో మాలదారులతో పాటు కుటుంబసభ్యులు, బంధువులైన సురేష్ భార్య తుళ్లూరి వనిత(32), ఉప్పాళ్ల ఆదిలక్ష్మి, ఉప్పాళ్ల శ్రీను, ఉప్పాళ్ల తాతా కౌసల్యలు కూడా వెళ్లారు. వీరంతా శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో ఇరుముడులు చెల్లించుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. తిరిగి వస్తూ శనివారం రాత్రి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు విశ్రాంతి తీసుకుని తిరిగి బయలుదేరారు. 5.30 గంటల సమయంలో అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర హైవేపై పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని గీతిక పాఠశాల వద్ద ఉన్న మలుపులోని హెచ్చరిక బోర్డును తొలుత ఢీకొట్టి ఆ తర్వాత ఆ పక్కనే ఉన్న చెట్టును కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారులోని నలుగురు మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దతిరుపతి మృతి చెందగా ఆయన భార్య కౌసల్య తీవ్రంగా గాయపడ్డారు. సురేష్, ఆయన భార్య వనిత, మేనమామ ఉప్పాళ్ల యోబులు మృతి చెందగా యోబులు భార్య ఆదిలక్ష్మి, ప్రణయ్‌కుమార్, ఉప్పాళ్ల శ్రీనులకు తీవ్రగాయాలయ్యాయి. సురేష్ ప్రతి ఏడాది ఆంజనేయస్వామి మాలధరించి తిరుమల సమీపంలోని జపాలికి వెళ్తుండేవాడు. ఈసారి కొండగట్టుకు వెళ్లాలని నిర్ణయించుకుని కారులో వెళ్లి వస్తూ మృతి చెందాడు. సురేష్ విద్యుత్ కాంట్రాక్ట్ పనులు చేయిస్తుండగా, ఆయన భార్య వనిత కుట్టుమిషన్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దతిరుపతి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

**ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్పీ**

ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు, గురజాల డీఎస్పీ జగదీష్, ఆర్డీవో మురళీకృష్ణ, సీఐ వెంకట్రావు, సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిని పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదం గురించి బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఆస్పత్రి వద్దకు తరలివచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు ఒంగోలు, నెల్లూరుకు క్షతగాత్రులను తీసుకెళ్లారు. జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్‌కుమార్, పిడుగురాళ్ల రవాణాశాఖ అధికారి రాంబాబులు చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. రెండు రోజులు వరుసగా ఒకరే కారు డ్రైవింగ్ చేయడం, విశ్రాంతి లేకపోవడంతో నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఎస్పీ తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పోలీసు, వైద్యాధికారులు, మృతుల బంధువులతో ఫోన్‌లో మాట్లాడారు.

- బ్రాహ్మణపల్లి సమీపంలో అదుపుతప్పిన కారు
- నలుగురు మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు
- కొండగుట్టలో మొక్కు చెల్లించి వస్తుండగా ఘటన
- మృతులది కావలి సమీపంలోని సిరిపురం గ్రామం



మలుపువద్ద కారు ఢీకొట్టగా పడిపోయిన హెచ్చరిక బోర్డును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



సంఘటనలో మృతిచెందిన వారు (సర్కిల్‌లో) మొదటి ఫొటో ఉప్పాళ్ల యోబులు, రెండో ఫొటో తాతా పెద్ద తిరుపతి, మూడో ఫొటో తుళ్లూరి సురేష్, వనిత దంపతులు (ఫైల్)

# నేటితో గడువు ముగింపు

- పట్టభద్రుల ఓటుకు వేలల్లో దరఖాస్తులు
- ఇప్పటికే 2,90,978 మందికి ఓటు హక్కు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు సోమవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం కూడా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. గత నెల 23న డ్రాఫ్టు ఓటరు లిస్టుని ప్రచురించిన తర్వాత ఈ నెల 9 వరకు క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు ఎన్నికల సంఘం గడువు ఇవ్వడంతో ఇంకా ఓటరుగా నమోదు కాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మరో 60 వేలకు పైగా కొత్త దరఖాస్తులు ఆరు జిల్లాల నుంచి రావడం విశేషం. ఇంకా మరికొన్ని గంటల గడువు సమయం మాత్రమే ఉండటంతో ఈ సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉన్నది. ఎవరైతే 2021 నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రీ పట్టాని పొంది ఉంటారో వారందరికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే 2 లక్షల 90 వేల 978 మంది పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీలు సమీపిస్తున్న దృష్ట్యా క్లెయిమ్‌ల సందర్భంగా వస్తోన్న దరఖాస్తులను మరుసటి రోజే పరిశీలన జరిపించి పరిష్కరిస్తున్నారు.



## విశాఖలో పారాగ్లైడింగ్

▸ విజయవంతమైన ట్రయల్‌రన్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు రుషికొండ బీచ్‌లో పారాగ్లైడింగ్ అందుబాటులోకి రానుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ బీచ్‌లో ఇప్పటికే బోటుషికార్, స్కూబా డైవింగ్ తదితర అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులో వున్నాయి. పారాగ్లైడింగ్ కొత్త అనుభూతిని అందించనుంది. నింగి, నేలను తాకుతూ సముద్రంలో ఎగసిపడే కెరటాలు... మరో పక్క ఎత్తైన కొండలను వీక్షిస్తూ నీలాకాశంలో విహరించడం పర్యాటకులకు మధురానుభూతిని స్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

# అనంత పోలీసుల కస్టడీలో బోరుగడ్డ

### విచారణలో 'తెలియదు, గుర్తులేదు..' సమాధానాలు

అనంతపురం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను ఆదివారం తెల్లవారుజామున అనంతపురం తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ బోరుగడ్డ యూట్యూబ్ చానల్‌లో మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ నిమిత్తం బోరుగడ్డను కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజుల కస్టడీ కోరారు. శనివారం అతనికి వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించారు. కాగా, బోరుగడ్డ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన్ను తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా.. అప్పటికే అక్కడి లైట్లన్నీ ఆర్పేశారు. వచ్చీ రాగానే అనిల్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసుస్టేషన్‌కు తాళం వేశారు.



### విచారణకు సహకరించని అనిల్

విచారణలో అనిల్ పోలీసులకు సహకరించలేదని సమాచారం. 'తెలియదు.. పెద్దగా గుర్తులేదు..' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. అనిల్ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా 'నువ్వే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. 3 రోజుల కస్టడీ తర్వాత అతనికి సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత రాజమండ్రి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణ సమయాన్ని చూపి మంగళవారం ఉదయం అక్కడి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

▸ 11న రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు



విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండగా, ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తరువాత కూడా పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 11వ తేదీనాటికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 11వ తేదీన రాయలసీమలో విస్తారంగా, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

### అన్నదాతలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కల్లాల్లో ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరి కోతలు వాయిదా వేసుకునేలా అన్నదాతలను అప్రమత్తం చేయాలని ఆదివారం రాత్రి కలెక్టర్లు, జేసీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతులు నూర్చిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వరికుప్పలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వ్యవసాయశాఖను ఆదేశించారు.

# వెనక'బడి'ంది!




▸ ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్

▸ నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే

▸ ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్

▸ సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఉంటే సరైన ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న చోట సదుపాయాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల అసలు ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన బడి రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ బడి ఏ స్థాయిలో ఉంది? అనే కోణంలో వివరాలు సేకరించడంతో ఇప్పటివరకూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని తేలిపోయింది. బడుల్లో మౌలిక సదుపాయాలకు 5 స్టార్లు, అభ్యసన ఫలితాలకు 5 స్టార్లు ప్రామాణికంగా ఈ అధ్యయనం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 45,087 ఉంటే... వాటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. మరోవైపు సదుపాయాల్లో 87, అభ్యసన ఫలితాల్లో 311 బడులకు అసలు రేటింగే దక్కని (జీరో రేటింగ్) దారుణమైన స్థితిలో ఉన్నాయి.

### సొంత భజనతో సరి

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు- నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని జగన్ పదే పదే సొంత భజన చేసుకున్నారు. తీరా ఇప్పుడు మౌలిక సదుపాయాల విభాగంలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. అదేవిధంగా అభ్యసన ఫలితాల్లో సైతం ఒక్కటీ ఫైవ్ స్టార్ సాధించకపోగా, కేవలం 41 పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ సాధించాయి. మిగిలిన 45 వేల పైచిలుకు బడులన్నీ త్రీ స్టార్, అంతకంటే తక్కువ స్థాయికే పరిమితమయ్యాయి.

> విద్యారంగంలో సంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీన స్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దారుణంగా దెబ్బతీశాయి. విద్యార్థుల హాజరు, ఫలితాలను పట్టించుకోకుండా టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పాటు బోధన సమయాన్ని తగ్గించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో బడుల్లో మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయని తేలిపోయింది. గత ప్రభుత్వం తీరుతో ఇప్పుడు పాఠశాలలు సింగిల్ స్టార్ దక్కించుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి.

### స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

### అన్ని జిల్లాల్లోనూ అదే తీరు

ప్రభుత్వ పాఠశాలల స్థితి దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ ఒకేలా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 2,913 బడులకు గాను 161 చోట్ల మాత్రమే మౌలిక సదుపాయాలు ఫరవాలేదన్నట్టుగా ఉన్నాయి. అయితే అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఒక్క బడి కూడా నాలుగు స్టార్లు సాధించలేదు. అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, కాకినాడ, కర్నూలు, ఎన్టీఆర్, నెల్లూరు, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లోనూ ఒక్క పాఠశాలకూ నాలుగు స్టార్లు దక్కలేదు. ఎక్కువ పాఠశాలలు రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి.

**బడులకు ఇచ్చిన రేటింగ్‌లు ఇలా..**

| స్టార్ రేటింగ్ | మౌలిక సదుపాయాలు | అభ్యసన ఫలితాలు |
|---|---|---|
| జీరో స్టార్ | 87 | 311 |
| ఒక్క స్టార్ | 1,958 | 14,095 |
| టూ స్టార్ | 16,816 | 26,272 |
| త్రీ స్టార్ | 19,438 | 4,368 |
| ఫోర్ స్టార్ | 6,788 | 41 |
| ఫైవ్ స్టార్ | 0 | 0 |

### ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు- నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చింది.

## నవ్య | చిత్రజ్యోతి

## పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్, యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

## యాక్షన్ థ్రిల్లర్




పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లోకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

## డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?






సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహాడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

### అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

## 14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల చైర్మన్ టీడీ జనార్దన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్ధన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్లు అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

## ఒక్కసారి ప్రేమిస్తే చాలు




బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా...ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.



## మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి

ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుమ్‌బాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



## అరకులో మాస్ జాతర

రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లొకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## అసత్య ప్రచారాన్ని ఆపండి

- రెహమాన్ కుమార్తె ఖతీజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైనా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్..సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

## 14న ఆలపాటి ఆత్మీయ సమావేశం

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మద్దతుదారులు జిల్లాలోని పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతలతోపాటు, వివిధ ప్రజా సంఘాలు ఈ నెల 14న గుంటూరులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న శ్రీ కన్వెన్షన్ హాలులో ఉదయం పది నుంచి ఒంటి గంట వరకూ ఈ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో కూటమి ప్రముఖులతో పాటు, ప్రజా సంఘాల ముఖ్య నేతలు హాజరుకానున్నారు.

## కమ్మ హాస్టల్ రుణం తీర్చుకోలేనిది

● రూ.8,21,000 విరాళం అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శతాబ్ద కాలం పైగా తనలాంటి పేద విద్యార్థులకు ఉచిత వసతి కల్పించడంతోపాటు భోజనం పెట్టి తన చదువుకు, ఉన్నతికి ఎంత గానో దోహదం చేసిన కమ్మ హాస్టల్ రుణాన్ని జన్మజన్మలకు తీర్చు కోలేనని వినుకొండ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు.



జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

స్థానిక అరండల్ పేట, శాఖమూరి లక్ష్మీ దేవమ్మ, కమ్మ హస్టల్ ప్రాంగణంలో కమ్మ పాలకమండలి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయనకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య లాంటి పెద్దల నేతృత్వంలో ఈ వసతి గృహం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తనలాంటి వేలాదిమంది విద్యార్థులు చదువుకొని దేశ విదేశాలలో ఉన్నత రంగాలలో రాణించడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. వసతి గృహ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కమ్మ హాస్టల్‌కు ఆయన రూ.8,21,000 విరాళాన్ని కార్యదర్శి మందలపు బంగారు బాబుకు అందజేశారు. పూర్వ విద్యార్థి సంఘం రూ 2,21,000 విరాళాన్ని అందజేసింది. కార్యక్రమంలో కొర్రపాటి రామారావు, బొల్లెపల్లి శ్రీనివాసరావు, పాలేటి శ్రీనివాసు, గడ్డిపాటి సుధాకర్, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# నేను ఆడుకున్న నేల ఇది

**రావిపాడు అమలోద్భవి మాత ఉత్సవాల్లో కేంద్రమంత్రి పెమ్మసాని**

రావిపాడు(నరసరావుపేట), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రావిపాడు తాను ఆడుకున్న నేల అని, అక్షరం దిద్దింది.. పుస్తకం పట్టింది కూడా ఇక్కడేనని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన బాల్యాన్ని గుర్తు తెచ్చుకున్నారు. నరసరావుపేట మండలం రావిపాడులోని అమలోద్భవిమాత ఉత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. 'అమ్మను ఎలాగైతే మర్చిపోలేమో.. తనకు చదువు నేర్పిన టీచర్లను కూడా ఎప్పటికీ మర్చిపోలేను. ఒక పిల్లవాడు ఎదిగే క్రమంలో కొన్ని కొన్ని సంఘటనలు ఎదురవుతాయి.. ఆ సంఘటనలు ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేస్తాయి' అని అన్నారు. అమెరికాలో ఎంత పెద్ద బిజినెస్ సామ్రాజ్యాన్ని తాను స్థాపించినా, వైద్యుడిగా సేవ చేస్తున్నా, రాజకీయ రంగంలో ప్రజాసేవ చేస్తున్నా.. ఉపాధ్యాయులు తనకు నేర్పిన క్రమశిక్షణ, విలువల వల్లే ఇవన్నీ సాధ్యమయ్యా యని అన్నారు. చిన్నతనంలో ఎంత మంచి నడవడికను అలవాటు చేసు కుంటే ఎదిగాక సమాజానికి అంత విలువ ఇస్తాం అనేది నేర్చుకున్నానని, తనకు టీచర్లు చెప్పిన పాఠాలు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. ఈ సందర్భంగా తన బాల్యమిత్రులను పెమ్మసాని కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

రావిపాడు వాసుల నుంచి పెమ్మసానికి అపూర్వ స్వాగతం లభించింది. చర్చి ఫాదర్లు ఆయనను ఆశీర్వదించారు. గ్రామ పెద్దలు, టీడీపీ నేతలు చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పూదోట సునీల్, నాగోతు శౌరయ్య, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు మీదగా మరిన్ని శబరి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మకరవిలక్కు పండగకు శబరిమలకు వెళ్లే అయ్యప్పభక్తుల సౌకర్యార్థం మరిన్ని రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. నంబరు. 07167 మౌలాలి -కొట్టాయం ప్రత్యేక రైలు జనవరి 3, 10, 17, 24, 31(ప్రతి శుక్రవారం) మధ్యాహ్నం 2.30కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, తెనాలి, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 6.45కి కొట్టాయం చేరుకొంటుంది. నంబరు. 07168 కొట్టాయం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు జనవరి 4, 11, 18, 25, ఫిబ్రవరి 1 తేదీల్లో(ప్రతి శనివారం) రాత్రి 9.45కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30కి సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. అలానే నంబరు. 07169 కాచీగూడ - కొట్టాయం ప్రత్యేక రైలు జనవరి జనవరి 5, 12, 19, 26(ప్రతి ఆదివారం) మధ్యాహ్నం 12.30కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా ప్రయాణించి సోమవారం సాయంత్రం 6.50కి కొట్టాయం చేరుకొంటుంది. నంబరు. 07170 కొట్టాయం - కాచీగూడ రైలు జనవరి 6, 13, 20, 27 తేదీల్లో(సోమవారం) రాత్రి 8.50కి బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి దాటాక 1 గంటకు కాచీగూడ చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల సర్వీసులను యాత్రికులు వినియోగించుకోవాలని డీఆర్ఎం ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### విదర్భపై కర్ణాటక ఘనవిజయం



ఐదు వికెట్లు తీసిన ధ్యాన్ హిరేమత్

మంగళగిరి సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ జట్టుపై కర్ణాటక ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు వికెట్ల నష్టానికి వంద పరుగులతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభిం చిన విదర్భ జట్టు కేవలం 156 పరుగులకే ఆలౌట యింది. విదర్భ బ్యాటర్ కుష్ శర్మ 41 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్ ధ్యాన్ హిరేమత్ 5 వికెట్లు పడగొ ట్టాడు. అనంతరం 182 పరు గుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 51.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కర్ణాటక బ్యాటర్లు జే.సుకృత్ 81 పరుగులు, ఆరుష్ జైన్ 49 పరుగులు సాధించారు.

### వివాహేతర సంబంధం నేపథ్యంలో మహిళ హత్య

సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన పట్టణంలోని పాకాలపాడు రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రంగాకాలనీకి చెందిన తోకల రమాదేవి(35), రాజుపాలెం మండలం కొత్తూరుకి చెందిన వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. రమాదేవి కుమార్తె స్థానిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తుంది. పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం ఉండటంతో రమాదేవితో వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తి ఆమెను పాఠశాల దగ్గరకు వెళదామని చెప్పి ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్ళాడు. శనివారం సాయంత్రం రమాదేవి కుటుంబసభ్యులు ఆమె ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో, ఆ వ్యక్తికి వారు ఫోన్ చేసినా సమాధానం రాలేదు. రమాదేవి కుటుంబ సభ్యులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం పాకాలపాడు రోడ్డులో రమాదేవి మృతదేహం పడి ఉండటాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. పట్టణ సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సంధ్యారాణిలు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట్రావుని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

# యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

**□ ప్రసాద్ అగ్రిటెక్ శంకుస్థాపనలో పెమ్మసాని**

ప్రత్తిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువతకి ఉపాధి కల్పించడమే లక్ష్యమని, అందులో భాగంగానే కాకుమానులో ప్రసాద్ అగ్రిటెక్ ఇన్నోవేషన్ సెంటర్‌కు పునాది పడుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కాకుమానులో ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రసాద్ అగ్రిటెక్ ఇన్నోవేషన్ సెంటర్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, కారుమంచి ప్రసాద్ తల్లిదండ్రులు కోటయ్య, నాగరత్తమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన కమ్యూనిటీ హాలును, జడ్పీ హైస్కూల్ నూతన భవనాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ డ్రోన్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా వెయ్యి మందికి ఎంప్లాయిమెంట్ కల్పించాలనేదే లక్ష్యమని, దేశ వ్యాప్తంగా వీరి సేవల ద్వారా ఎంతో ఉపయోగం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ప్రత్తిపాడు ఈ ట్రైనింగ్ సెంటర్ ద్వారా వేల మందికి ఉపాధి దొరుకుతుందని అన్నారు. కారుమంచి ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పుల దృష్ట్యా యాంత్రీకరణ వైపు దృష్టి పెట్టినట్టు తెలిపారు.భవిష్యత్తులో కాకుమాను డ్రోన్‌ల హబ్‌గా తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కే నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ సునీల్ చౌదరి, జడ్పీటీసీ గుల్జార్ బేగం, ఎన్.పూర్ణచంద్రరావు, సంగం డెయిరీ డైరెక్టర్ డీ వెంకట సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ఎం రాంగోపాల్ పాల్గొన్నారు.



ప్రసాద్ అగ్రిటెక్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, చిత్రంలో ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్, ఎమ్మెల్యే రామాంజనేయులు

# నాగమ్మ దేవాలయం పునర్నిర్మాణానికి చర్యలు

**టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి**

దాచేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నాగమ్మ గుడి సమీపంలో శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రాయశ్చిత్త యజ్ఞం పూర్తిచేశారు. ప్రభుత్వ నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టడంతో పాటు పల్నాడు చరిత్ర, వైభవం ఈ ప్రాంత ప్రాశస్త్యం, నాయకురాలు నాగమ్మ పరిపాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, వీరోచిత గాధలు భావితరాలకు తెలిసే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నాగమ్మ దేవాలయానికి 24 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో కొంతమేరకు ఆక్రమణలకు గురికాగా మిగిలిన భూమి ఆలయానికి చెందేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో పదకొండవ శతాబ్దంలో పల్నాటి నాగమ్మ నిర్మించిన శ్రీ చెన్ను మల్లికార్జునస్వామి దేవాలయాన్ని ఆదివారం పురావస్తుశాఖ, దేవాదాయశాఖ అధికారులు టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తితో కలిసి సందర్శించారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులోని ఈ ఆలయాన్ని తాళ్లాయపాలెం కోటిలింగాల క్షేత్ర పీఠాధిపతి శివస్వామి పర్యవేక్షణలో మార్చి 14న జీర్ణోద్ధరణ చేసి పునఃప్రతిష్ఠ జరపాలని జంగా కృష్ణమూర్తి సంకల్పించారు. ఈ నేపథ్యంలో చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పురావస్తుశాఖ ఏడీ నరసింహనాయుడు, పల్నాడు జిల్లా దేవాదాయ శాఖ అధికారి కే వీరాంజనేయులు, రెవెన్యూశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంతో పాటు దాతల సహకారాన్ని కూడా తీసుకోనున్నట్లు జంగా తెలిపారు. కార్యక్రమంలో దాచేపల్లి మండల దేవదాయ శాఖ ఈఓ నెమలిరెడ్డి, రెవెన్యూశాఖ ఆర్ఐ శరత్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్, పల్నాడు చరిత్ర పరిరక్షణ కమిటీ సభ్యులు బెహరా వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామిని శాలువాతో సత్కరించి ఆహ్వానిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూరి

### అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



ముశ్యం రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో చేసిన అప్పులు తీర్చలేక ప్రస్తుతం సాగుచేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం దాచేపల్లి నగర పంచాయతీలోని ఎంఎస్ పేటలో జరిగింది. మృతుడు ముశ్యం రామకృష్ణ (48) గతంలో రూ.15 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఈ ఏడాది నాలుగున్నర ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని పత్తి, మిరప పంటను సాగు చేస్తున్నాడు. అయితే, పంట దిగుబడి సరిగా రాకపోవడం, అప్పులు పెరిగిపోవడం, రుణదాతల నుండి ఒత్తిడి రావడంతో శనివారం సాయంత్రం పంట పొలంలో పురుగుమందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందించారు. చికిత్స పొందుతున్న రామకృష్ణ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాచేపల్లి సీఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 106,114,125 |
| చికెన్ విత్ స్కిన్ | 204.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 214.00 |

# విభజన హామీల సాధనకు రాజీ లేని పోరాటం

**ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్**

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. గుంటూరులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అనే వారు రాష్ట్ర ద్రోహులు అని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్థిరపడేందుకు కొంత సమయం ఇచ్చామే కానీ, ప్రత్యేక హోదా ఉద్యమం ఆగలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకి ప్రత్యేక ప్యాకేజీ కింద కేంద్రం ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని గుర్తుచేశారు. రాజధాని నిర్మాణానికి ఇస్తామన్నా నిధులు కేంద్ర సహాయమా లేక రుణమా అనే విషయంపై స్పష్టత లేకపోవడం విచారకరమని అన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆస్తిపై కాకుండా విభజన హామీల సాధనపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న మోసాన్ని చంద్రబాబు గ్రహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడం కన్నా రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి కాపాడుకోవాలని సూచించారు. విద్యుత్ రంగాన్ని బడాబాబులకు కట్టబెట్టే కన్నా ఏపీ జెన్కోకి అప్పగిస్తే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. రేషన్‌కి బదులు నగదు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఇది సరైన విధానం కాదని విమర్శించారు. ట్రేడింగ్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగడంతో పాటు రైతుకు మేలు జరుగుతుందని సూచిం చారు. సమావేశంలో సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, మేడా హనుమంతురావు, టీ నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్, పాల్గొన్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

# కాలనీలు.. పునాదుల్లోనే..

● పేరుగొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు

(5వ పేజీ తరువాయి)

మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. ఆర్భాటంగా స్థలాలిచ్చి అధికారులకు లక్ష్యాలు పెట్టి లబ్ధిదారులపై ఒత్తిళ్లు తెచ్చినా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. దీంతో అత్యధిక కాల నీల్లో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీలైనన్ని ఎక్కువ ఇళ్లు పూర్తి చేయించి ఫిబ్రవరిలో సామూహిక గృహ ప్రవేశాలు చే యించాలని గత ప్రభుత్వం నిర్ణయించినా లబ్ధిదారుల నుంచి స్పందన రాలేదు. స్థలాలు పోతాయోమోనని కొందరు లబ్ధిదారులు పునాదులు వేసుకుని వదిలివేశారు. మరికొందరు కనాకష్టంగా ఇల్లు కట్టుకుంటే రవాణా, ఇతర సౌకర్యాలు కల్పించలేదు. కాలనీలకు మౌలిక వసతుల కల్పన గాలికొదిలేశారు. ఇళ్ల నిర్మాణం అంశంలో వైసీపీ ప్రభుత్వం చెప్పన గొప్పలు ఆచరణలో కనిపించలేదు. కొన్ని నెళ్లలుగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది.

**సౌకర్యాలు నాస్తి..**

ఆయా కాలనీల్లో పూర్తయిన ఇళ్ళల్లో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకున్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా ఇళ్లు ఉండటం, రహదారులు, రవాణా సౌకర్యాలు, తాగునీరు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో ఇళ్లల్లో నివాసం ఉండలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పూర్తయిన గృహాలకు కనీసం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారుల నిర్మాణాలను పూర్తిచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాలనీల్లో అంత ర్గత రహదారులు, మురుగు కాలువలు నిర్మించే విషయంలో తీవ్రజాప్యం జరుగుతోంది. వర్షం కురిస్తే రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనకు కూడా నిధుల కొరత వెంటాడుతోంది. ఇంటి నిర్మణాలు పూర్తయిన లబ్ధిదారులు నివాసం ఉండేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. అద్దెగృహాల్లోని నేటికి కాలం గడుతున్నారు.

**ప్రచారం.. ప్రహసనం**

పేదలకు సొంతింటి కల సాకారం పేరుతో జగనన్న కాలనీలను నిర్మిస్తున్నామని గత ప్రభుత్వం చేసిన ప్రచా రార్భాటం అంతా ఇంతా కాదు. జగనన్న కాలనీల పేరిట నడచిన ప్రహసనం పేదలకు ఎన్నో సమస్యలను తెచ్చిపె ట్టింది తప్పితే ఇళ్లు పూర్తి అయిన దాఖలాలు అరకొరే. తొలుత జగనన్న లే అవుట్లకు భూమి కొనుగోళ్లతో ప్రారంభమైన దందా తర్వాత లబ్ధిదారుల ఎంపిక, ప్రభుత్వం అందించే అరకొరసాయంతోనే నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులపై ఒత్తిళ్లు, ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే కాంట్రాక్టుల విషయంలో లొసుగులు, ఇళ్లు కట్టుకోకపోతే స్థలాన్ని తీసే సుకుంటామనే బెదిరింపులు ఇలా ఒకటేమిటి జగనన్న ఇళ్ల పేరిట ఎంతోమంది నిరుపేదలు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పోసొప్పో చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసినవారికి అక్కడ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా గత ప్రభుత్వం పూర్తిగా విఫలమ వడంతో జగనన్న కాలనీల వల్ల పేదలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నాగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట జరిగిన దోపిడీపై విచారణ జరిపించడమే కాకుండా ఇప్పటికే ఇళ్లు పూర్తి చేసుకున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 8 : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 41.69 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు.

## నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 584.90 అడుగులు ఉంది. ఇది 297.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5874, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,218 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,218 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

### దివ్యాంగుల సహాయార్థం
## రూ.50 వేలు విరాళం

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) గుంటూరులోని ఏఈఎల్‌సీ నార్త్ ప్యారీష్ చర్చిలో ఆదివారం జరిగిన కనికరయుత కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులు, కుష్ఠు వ్యాధిగ్రస్థుల సహాయార్థం రూ.50 వేలు అందజేశారు. ధరణికోట గ్రామానికి చెందిన లూథరన్ సంఘస్థులు పాస్టర్ ఏ సత్యానంద్ ఆధ్వర్యంలో ఈ విరాళాన్ని లూథరన్ చర్చీ నిర్వాహకులకు అందజేశారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ

మాచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ సాగరమాత ఆలయం వద్ద ఆదివారం ఫ్లయిటెక్ ఏవీయేషన్ ఎండీ కెప్టెన్ మమత ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత గ్రంథ ప్రచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరం, కంభంపాడు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవం పట్ల భక్తి ప్రపత్తులతో ఉండాలన్నారు. గ్రామాల్లో వీధి వీధికి తిరుగుతూ గ్రంథ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కటికం సైదారావు, వీరాంజనేయుల, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మి, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజినేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### పల్నాడు జిల్లా వాసవి సేవా సమితి
## అధ్యక్షుడిగా పుల్లారావు

దాచేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వాసవి సేవా సమితి సమైఖ్య అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన గరినె పుల్లారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నరసరావుపేటలో జరిగిన సమావేశంలో నరసరావుపేట ఆర్యవైశ్య ప్రముఖులు మిట్టపల్లి రమేష్ చేతులమీదుగా చీతిరాల గురుపెద్దన్న నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తాడువాయి రామకృష్ణ, కట్టమూరి అప్పారావు, అయినవోలు కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కనిగిరి విశ్వనాథం, కామిశెట్టి గురుమూర్తి, బొడ్డు ముక్కంటి, మండ్లెం రామారావు, కాకుమాను నరసింహారావు, కోలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం నేత ముస్తఫా మృతి

● పలువురి నివాళి

క్రోసూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలానికి చెందిన సీపీఎం నేత షేక్ ముస్తఫా(65) ఆదివారం మరణించారు. ఆయన మృతికి పలు రాజకీయ పార్టీల నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ నాయకులు బండారు మైసూర్ బాబు, షేక్ ముస్తఫా, షేక్ మస్తాన్ తదితరులు ముస్తఫా మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## వైభవంగా మంచికల్లు తిరునాళ్ల ప్రారంభం

రెంటచింతల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్నాట కోన సీమగా పేరుగాంచిన మంచికల్లు పోలేరమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారం రాత్రి అత్యంత భక్తి శ్రద్ధల నడుమ ఆరంభమయ్యాయి. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శక్తిని నిలిపే కార్యక్రమం చేపట్టారు. 15వ తేదీ నిర్వహించే శిడిమాను ఊరేగింపు ప్రధాన ఘట్టం. అదే రోజు భారీ ఎత్తున గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్వగ్రామం మంచికల్లు.

## తల్లీకుమార్తె ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసులు

మాచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లీ, కుమార్తె ఆత్మహత్యకు పాల్పడబోగా పోలీసులు కాపాడిన సంఘటన మాచర్ల మండలం కంభంపాడు వద్ద జరిగింది. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తోట మంగమ్మ, అనురాధలు తల్లీ, కుమార్తెలు. వీరు ఆదివారం మండలంలోని కంభంపాడు గ్రామ శివారు నాగార్జున సాగర్ కుడి కాలువ వద్ద సంచరిస్తుండగా స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మాచర్ల రూరల్ ఎస్ఐ నారాయణ సంఘటనా ప్రదేశానికి చేరుకొని ఆత్మహత్యకు యత్నిస్తున్న తల్లీ, కుమార్తెలతో మాట్లాడి పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. రూరల్ సీఐ నఫీజ్ బాషా వారివురికి కౌన్సిలింగ్ ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడవద్దని, ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించి వారి బంధువులకు అప్పగించారు.

### బేతరాజు చెరువు
# ఎత్తిపోతల పథకం పూర్తయ్యేనా?

● 50 సంవత్సరాల చేజర్ల వాసుల కల
● వైసీపీ హయాంలో ప్రారంభించిన పనులు
● నిధులు లేక నిలిచి పోయిన నిర్మాణాలు
● కూటమి ప్రభుత్వం పైనే ఆశలు



పూర్తయిన సంపువెల్

నాగార్జున సాగర్ కుడి కాలువ చేజర్ల గ్రామం పక్కగానే వెళ్తుంది. కానీ ఆ గ్రామంలోని పొలాలకు సాగునీరు దక్కటం లేదు. ఇక్కడి రైతులు ఎక్కువ శాతం మెట్ట పైర్లనే సాగు చేస్తుంటారు. బేతరాజు చెరువుకు ఎత్తి పోతల పథకాన్ని నిర్మిస్తే ఆయకట్టు భూములకు నీరు అందుతుందని చేజర్ల గ్రామస్థులు భావించారు. 50 ఏళ్లుగా తమ కలను నిజం చేసుకొనేందుకు ప్రయత్నాలు కొనసాగి స్తూనే ఉన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై నప్పటికీ నిధుల లేక పోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామస్థులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని ఉన్నారు.

నకరికల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 1972లో బేతరాజు చెరువును తవ్వించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి జలవనరుల మంత్రి అంబటి రాంబాబు ఈ ఎత్తి పోతల పథకానికి శంకు స్థాపన చేశారు. రూ 3.47 కోట్ల అంచనా వ్యయంతో పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవటంతో నిర్మాణాలు నిలిచి పోయాయి. సాగర్ కుడి కాలువ 92.2 కిలో మీటరు వద్ద నీటిని ఎత్తి పోసే పంపు హౌస్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. రెండు కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మించాల్సి ఉంది. 40హెచ్‌పీ సామర్థ్యం గల రెండు పంపులను ఏర్పాటు చేయాలి. 4.92 క్యూసెక్కుల నీటిని తోడి పోయాల్సి ఉంటుంది. దీని నీటి నిల్వ సామర్థ్యం 0.028 టీఎంసీలుగా ఉంది. ఈ చెరువు కింద 197 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే సంపు వెల్ పూర్తయింది. పంపు హౌస్ నిర్మాణంలో నిలిచి పోయింది. ఇన్‌టేక్ లైన్, పైపులైన్, డెలివరీ చానెళ్ళు దాదాపుగా తుది దశకు చేరుకున్నాయి. ప్రాజెక్టులో 75 శాతం మేర పనులు పూర్తయినట్టు ఇంజనీరింగ్ అధికారులు చెపుతున్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవటంతో నిర్మాణ పనులు నిలిచి పోయాయి. చేజర్ల గ్రామ ప్రజలు కొత్తగా అధికారంలోకి వచ్చిన



నిలిచి పోయిన సంపు హౌస్ నిర్మాణం

కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెట్టుకున్నారు. చేజర్ల ఎత్తిపోతల పథకం పనులను కొనసాగించేందుకు నిధులు విడుదల చేసేలా కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే యాభై ఏళ్ల తమ కల నెరవేరుతుందని చేజర్ల గ్రామ వాసుల ఆశాభావంతో ఉన్నారు.

### పశువుల సంతలో
## సౌకర్యాల మెరుగుదలకు కృషి

● పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్



క్రోసూరు పశువుల సంత ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మార్కెట్ యార్డులోని పశువుల సంతలో సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి క్రోసూరు మార్కెట్ యార్డులోని పశువుల సంత ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. సంతలోని నీటి సౌకర్యాలు పశువులకు మేత, నీడ, ఇతర సౌకర్యాలను నిశితంగా పరిశీలించారు. పశువుల సంతలోని దుకాణాలు ఖాళీగా ఉండటాన్ని గురించి ప్రశ్నించారు. ప్రతి గురువారం జరిగే పశువుల సంతకు లభించే ఆదాయం, కార్యకలాపాలు, ఎన్ని పశువులు ఇక్కడకు వస్తాయి?, ఎన్ని లావాదేవీలు జరుగుతాయి? మొదలైన వాటి గురించి ఆరా తీశారు. పశువుల సంత నుంచి ఏయే ప్రాంతాల నుంచి పశువుల ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయి?, రవాణా సౌకర్యం గురించి కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. సంతలో ఇంకా ఏమేమి సౌకర్యాలు, ప్రస్తుతం ఉన్న ప్రాంగణం సరి పోతుందా? లేదా. అనే దాని గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంత నిర్వాహణ రికార్డులను పరిశీలించారు. ఇంకా కొన్ని సౌకర్యాలు కావాల్సి ఉందని సిబ్బంది ఆయనకు తెలియజేశారు. అదనపు సౌకర్యాల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నలజాల సదాశివరావు, మన్నెం శ్రీనివాసరావు, గుడిపాడు బాషా, షేక్ మస్తాన్, షేక్ సలాం, ఊరే రోశయ్య, హనుమంతరావు, కొండవీటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## నాబార్డు నిధులు రూ.1.45 కోట్లు వెనక్కు..

● వైసీపీ పాలనలో అన్నీ పెండింగ్‌లే..
● మంత్రి అనగాని దృష్టికి భూ సమస్యలు..
● పదిలో 95 శాతం ఉత్తీర్ణత సాధిస్తే ఉపాధ్యాయులకు రివార్డులు..
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడి



ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయింపులో గత వైసీపీ పాలకులు తాత్సారం చేయడం వలన మంజూరైన నా బార్డు నిధులు రూ.1.45 కోట్లు వెనక్కి మళ్లాయని, దీంతో పాఠశాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలం లోని జెట్టిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ సమీపంలో 447/3 సర్వే నెంబరులో 6.80 ఎకరాలుండగా అందులో 5 ఎకరాలు పాఠశాల భవన నిర్మాణానికి కేటాయించాలంటూ అప్పటి గురజాల ఆర్డీవో పార్థసారధి, తహసీల్దారు ఏ.శ్రీనివాసరావులు సర్వే చేసి 2020 జూలై 14న ప్రభుత్వానికి నివేదిక పంపిస్తే బుట్టదాఖలా చేశారని దుయ్యబట్టారు. ఈకారణంగానే పాఠశాల భవనాల నిర్మాణాలకు కేటాయించిన నిధులను వినుకొండ గిరిజన సంక్షేమ పాఠశాల నిర్మాణానికి తరలించి మాచర్లకు మొండిచేయి చూపించారని, అప్పటి నుంచి పాఠశాల స్థలం బీడు భూమిగా దర్శనమిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి ఆభూమిని గిరిజన గురుకుల సొసైటీకి ఇచ్చేలా కృషి చేస్తానన్నారు.మాచర్ల నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు 95 శాతం పైగా మార్కుల సాధిస్తే ఆ పాఠశాలలోని టీచర్లందరికి ఒక్కొక్కరికి రూ.10 వేలు రివార్డు అందచేస్తానన్నారు. తాళ్లపల్లిలో కేంద్రీయ విద్యాలయం వచ్చేలా కృషిచేసిన ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జెట్టిపాలెం గ్రామానికి చెందిన గొట్టం శ్రీనివాసరెడ్డి, ప్రభురాజ్, లింగయ్య, నీలం మల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఎం.శౌరెడ్డి, మూలిరాయపరెడ్డి పాల్గొన్నారు.

### అధానితో సోలార్ ఒప్పందాన్ని
## రద్దు చేసుకోవాలి

మాచర్లటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అదానీతో జగన్ చేసుకున్న సోలార్ పవర్ ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని కొమెర వీరాస్వామి భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో అదానీతో సోలార్ ఒప్పందాన్ని వ్యతిరేకించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నారని జగన్‌ను విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ చార్జీలతో సహా అన్ని రకాల చార్జీలు ప్రజలపై మోపడంపై సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, కేతావత్ రంగానాయకులు, మిద్దెపోగు బాబురావు, షేక్ సైదా, నర్రా రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎంఎంఎస్‌లో
## కారంపూడి విద్యార్థి ప్రతిభ

కారంపూడి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బాలోత్సవంలో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) మోడల్ టెస్ట్‌లో స్థానిక బ్రహ్మనాయుడు జడ్పీహైస్కూల్ విద్యార్థి వింజమూరి చరణేశ్వర్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్ఎం అనంతశివ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థి చరణేశ్వర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ భానుప్రకాష్, వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ఒయ్యారి భామ'ను నివారించాలి

ముప్పాళ్ళ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఒయ్యారి భామ మొక్కను నివారించాలని కోరుతూ ఆదివారం మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సీసంధ్యారాణి, డాక్టర్ జీ.విజయకుమార్‌లు మాట్లాడుతూ ఒయ్యారి భామ మొక్క ప్రభావం పశువులు, పిల్లలు, పంటలపైనా ఉంటుందన్నారు. రైతు నాగిరెడ్డి స్థలంలో పెరిగిన ఒయ్యారి భామ మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో మాదల, నార్నెపాడు, సాతులూరు, చాగంటివారిపాలెం గ్రామాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

● తల్లి సమాధిని దర్శించుకొని వస్తుండగా ఘటన

మేడికొండూరు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన తల్లి సమాధిని దర్శించుకొని వస్తున్న ఆ యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించిన ఘటన ఆదివారం మేడికొండూరు సమీపంలో జరిగింది. బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెంకు చెందిన ఓర్సు వీర సింక్ (19) అనే యువకుడు తన ల్లిదండ్రులతో కలసి గుంటూరు నగరంలోని వెంకటరమణ కాలనీలో నివసిస్తూ మిర్చియార్డులో కూలీ పనులకు వెళుతుంటాడు. వీరసింక్ తల్లి గుండెపోటుతో మూడేళ్ల క్రితం మరణించింది. ఆమెను స్వగ్రామమైన ఎమ్మాజీగూడెంలో ఆమెను సమాధి చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా అతను ఎమ్మాజీ గూడెం వెళ్లి తల్లి సమాధి వద్ద ప్రార్థన చేసి వస్తుంటాడు. అదే విధంగా ఆదివారం తల్లి సమాధి వద్ద ప్రార్థన ముగించుకొని గుంటూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వీర సింక్ అక్కడికక్కడే మరణించాడు. తండ్రి ఓర్సు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లి మరణించిన రోజునే కుమారుడు మృత్యువు పాలైన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర వేదనచెందారు.



రెండవ బహుమతి అందుకుంటున్న సత్తెనపల్లి టీమ్

### వీపీఎల్ క్రికెట్‌లో
## రన్నర్‌గా సత్తెనపల్లి టీం

వినుకొండటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలోని సాయిబాబా దేవస్థానంవద్ద వినుకొండ ప్రీమియర్ లీగ్(వీపీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తెనపల్లి టీం రన్నర్‌గా నిలిచింది. నాలుగు రోజులుగా జరిగిన ఈ పోటీల్లో ప్రకాశంజిల్లా వేటపాలెంకు చెందిన కోటి ఫ్రెండ్స్ టీమ్ విన్నర్‌గా నిలిచి రూ. లక్ష నగదుతోపాటు ట్రోఫీని చేజిక్కించుకున్నారు. రన్నర్‌గా నిలిచిన సత్తెనపల్లికి చెందిన పల్నాడు ఓవర్‌సెస్ టీం రూ.75 వేలు నగదుతో పాటు ట్రోఫీని అందుకుంది. డాక్టర్ కేసరి వెంకటేశ్వరరావుతో పాటు గ్రామ పెద్దలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీపుల్స్ ట్రామా ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టరు కేసరి వెంకటేశ్వరరెడ్డి (న్యూరోసర్జన్), నిర్వాహకులు జానారెడ్డి, పేరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏరువ ఈశ్వరరెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు ఆహ్వానం

క్రోసూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 14 అంగన్‌వాడీ టీచర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఉమా మహేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెదకూరపాడు మండలంలోని కంభంపాడు- 2 పోస్టును ఓసీలకు, ముస్సాపురం -2 బీసీఏ, హుస్సేన్‌నగర్ - 1 ఎస్సీ బుచ్చయ్యపాలెం ఓసీలకు కేటాయించినట్లు చెప్పారు. క్రోసూరు మండలంలో పీసపాడు -3 పోస్టును ఓసీలకు, గుడిపాడు - 2 బీసీఏకి, క్రోసూరు -1ఎస్సీకి క్యాటగిరికి, గుడిపాడు -1 ఎస్సీకి కేటాయించినట్లు తెలిపారు. అమరావతి మండలంలోని ముత్తాయపాలెం పోస్టును ఓసీ క్యాటగిరికి, అమరావతి - 2 ఎస్సీకి, ధరణికోట - 5 ఓసీకి, లింగాపురం- 1ఎస్సీకి కేటాయించినట్లు తెలిపారు. అచ్చంపేట మండలంలోని తాళ్ళచెరువు - 5 పోస్టును ఓసీలకు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నిర్ణీత నమూనాలో దరఖాస్తులు పూర్తి చేసి 75 తాళ్ళూరులోని ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు స్థానికులై, 10వ తరగతి పాసై ఉండాలని, 21 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండి వివాహితురాలై ఉండాలని తెలిపారు. పుట్టిన తేదీ, కులం, విద్యార్హత,నివాసం, అనుభవం, అదనపు అర్హతలు వంటి ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు విడో,అనాథ, దివ్యాంగులైతే ఆయా ధ్రువీకరణపత్రాన్ని జతచేయాలని సూచించారు.

### ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో
## పంట కోత ప్రయోగం



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న సైదయ్య తదితరులు

బెల్లంకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రాజుపాలెం, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లో ఆదివారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పొలాల్లో వరి నేలవాలి పోవడంతో దిగుబడి తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారన్నారు. ఆదేసందర్భంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేపట్టిన రైతుల పొలాల్లోని వరి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని నిలబడుతుందన్నారు. అందుకే ప్రతి రైతు ప్రకృతి సాగు వైపు దృష్టిసారించాలని సూచించారు. ఈ విధానంలో ప్రధాన పంట వేయటానికి ముందుగా 30 రకాల విత్తనాలు వేసి 45 రోజుల తర్వాత వరి పంట వేసిన పొలాల్లో 5/5 మీటర్లు విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 18.38 కేజీలు దిగుబడి వచ్చిందన్నారు. ఎకరానికి పెట్టుబడి ఖర్చు రూ.17 వేల నుంచి రూ.20 వేలు మాత్రమే అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, బద్దూరి కృష్ణారెడ్డి, మాధవి, శ్రీనివాసరెడ్డి, ధర్మతేజ, స్వప్న, మాధురి పాల్గొన్నారు.



పటిక బెల్లంతో అయ్యప్పకు అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

## పల్నాట ఆధ్యాత్మికత వెల్లివిరియాలి

● అయ్యప్ప పడిపూజా మహోత్సవంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్నాడులో ఆధ్యాత్మికత వెల్లివిరియాలని, ప్రజలంతా భక్తి భావంతో ప్రశాంత జీవనం సాగించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజా మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పటిక బెల్లంతో (కలకండ) స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 41 రోజుల పాటు కఠోరమైన దీక్ష చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. మాలాధారణ దీక్షలు వ్యక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంచుతాయని, వారి ప్రవర్తనలో మార్పుని తీసుకువస్తుందన్నారు. గురుస్వామి నేతృత్వంలో 18 రకాల అభిషేకాలను నిర్వహించారు. అరటి ఓడెలతో అలంకరించిన మండపం ప్రత్యేక ఆకర్షణగా ఉంది. నిర్వాహకులు ప్రభురాజ్, లింగయ్య యాదవ్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నియోజకవర్గ సభ్యత్వ వివరాలను ఫోన్‌లో చూసి వెల్లడిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

## టీడీపీ సభ్యత్వంతో ఎంతో భరోసా

● పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో ఎంతో భరోసా లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. క్రోసూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం క్రోసూరు, అచ్చంపేట మండలాల టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో టీడీపీ సభ్యత్వం 72 వేల టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు 60 శాతం పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు 43,631 మంది సభ్యత్వాన్ని పొందారని, వారిలో లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందిన వారు 36 మంది ఉన్నారన్నారు. పెదకూరపాడు మండలంలో 12,898 మంది, అమరావతి మండలంలో 9,802 మంది, అచ్చంపేట మండలంలో 8,643 మంది, క్రోసూరు మండలంలో 7,155 మంది, బెల్లంకొండ మండలంలో 5,140 మంది సభ్యత్వాలు పొందిన వారిలో ఉన్నారన్నారు. సభ్యత్వాల లక్ష్యం ప్రకారం ఇంకా 28,369 మంది సభ్యత్వాలు పొందాల్సి ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలందరూ ప్రతి గ్రామంలోను శిబిరాలు ఏర్పాటు చేసి ఈ నెలాఖరు నాటికి లక్ష్యానికి మించి సభ్యత్వాలు నమోదు చేయాలని, జిల్లాలో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రెండు మండలాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బకాయిలను వెంటనే చెల్లించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి
● మాచర్లలో నూతన కార్యాలయం ప్రారంభం



ఏపీటీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చిరంజీవి

మాచర్లటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. పట్టణంలో నూతనంగానిర్మించిన ఏపీటీఎఫ్ (1938) కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుంటే ఈనెల 21, 22 తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మినిమం టైంస్కేల్‌తో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ బోధనేతర పనులైన యాప్‌ల భారం తగ్గించాలని, ఐఆర్, డీఏలను ప్రకటించాలని కోరారు. పాఠశాల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీవో నంబరు 117ను రద్దుచేసి పూర్వ పద్ధతిలో కొనసాగించాలన్నారు. అలాగే పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యమ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కె సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంపత్‌బాబు, కొమ్ము కిషోర్, అల్లి సునీల్‌కుమార్, పోతురాజు, సుధాకర్, మధుబాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మరియదాసు, పల్నాటి శ్రీను, యోహాన్, మోహన్‌రావు, స్వరూపారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ సభ్యుడు సదాశివరావు దంపతులను సన్మానించిన వైకుంఠపురం నాయకులు

### వైకుంఠపురం ఆలయాన్ని సందర్శించిన
## టీటీడీ బోర్డు సభ్యుడు సదాశివరావు..

అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు నన్నపనేని సదాశివరావు దంపతులు ఆదివారం మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు సదాశివరావు దంపతుల పేరుమీద స్వామివార్లకు పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఎం.విఠల్‌రావు, టీడీపీ నేతలు బీ.నాగేశ్వరరావు, బీ.శ్రీను, ఆలోకం కోటయ్య, వెంకటకృష్ణ, ఎస్. గణపతిరావు, బీ.రవి, జే.శ్రీను తదితరులు సదాశివరావు దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. వైకుంఠపురం ఆలయ అభివృద్ధికి టీటీడీ తరుపున కృషి చేయాలని వారు కోరారు.

## ప్రమాదవశాత్తు యువకుడి మృతి

● వరికోత మిషన్ మరమ్మతు చేస్తుండగా దుర్ఘటన
● మృతుడు తమిళనాడు వాసిగా గుర్తింపు

నకరికల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరి కోత మిషన్‌ను మరమ్మతు చేస్తుండగా జాకీ జారి, మిషన్ అతనిపై పడటంతో యువకుడు మృతి చెందిన సంఘటన దేచవరంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురజాల వెంకటేశ్వరరావు పొలంలో కోత కోసేందుకు వరికోత మిషన్‌ను ఆన్ చేయగా రబ్బర్ చెయిన్ తెగి పోయింది. విజయవాడ నుంచి కొత్త రబ్బర్ చైన్‌ను తీసుకువచ్చారు. అనంతరం ఆపరేటర్ పలనివేల్ జాకీ సాయంతో మిషన్‌ను పైకి లేపి ఆ రబ్బర్ చైన్‌ను ఎక్కించే ప్రయత్నం చేస్తుండగా జాకీ జారిపోయింది. దీంతో మిషన్ అతనిపై పడటంతో పలనివేల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తమిళనాడులోని కల్లకుర్చి జిల్లా చిన్నసేలం తాలూకా వాసిగా గుర్తించారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల సబ్ స్టేషన్ పరిధిలో తూబాడు ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మరమ్మతుల వల్ల తూబాడు, గొరిజవోలు, సంక్రాంతిపాడు, చిరుమామిళ్ళ, జంగాలపల్లి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని ఆయన వివరించారు.

## మున్సిపాలిటీలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం

చిలకలూరిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పసుమర్రు గ్రామాన్ని చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, తమ గ్రామాన్ని గ్రామపంచాయతీగానే ఉంచాలని కోరుతూ పసుమర్రులో జరిగిన గ్రామసభలో ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామసభలో ముఖ్యఅతిథిగా గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి కళ్లం శ్రీనివాసరెడ్డి, గ్రామపరిధిలోని వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు (15వ వార్డు), షేక్ మస్తాన్ వలీ (16వ వార్డు), గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## నెట్‌బాల్ పోటీలకు బొప్పూడి హైస్కూల్ విద్యార్థిని


భానుప్రియ

చిలకలూరిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని డీ భానుప్రియ జాతీయ స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్‌లోని లూధియానాలో ఈ పోటీలు జరుగుతాయి. ఇటీవల రాష్ట్రస్థాయిలో అన్నమయ్య జిల్లాలో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో విశేష క్రీడా ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఈ విద్యార్థిని ఎంపికైంది.

## మాజీ మున్సిపల్ చైర్మన్ మాజేటి కన్నుమూత


వెంకటేశ్వర్లు (ఫైల్‌ఫొటో)

చిలకలూరిపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ మాజేటి వెంకటేశ్వర్లు(బేబి) (88) ఆదివారం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇక్కడ అంత్యక్రియలు జరిగాయి. ఆయన మృతికి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఆర్యవైశ్య సంఘం వారు సంతాపం ప్రకటించారు.

## బీఆర్‌కే చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం


పేద విద్యార్థిని ఎం పూజితకు ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో ఉన్న కార్యాలయంలో బొల్లు రాజేశ్వరి కృష్ణారావు(బీఆర్‌కే) చారిటబుల్ ట్రస్ట్ ఆదివారం ప్రతిభ కలిగిన పేద విద్యార్థిని మారిశెట్టి పూజితకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించింది. పూజిత నరసరావుపేటలోని ఎన్‌ఈసీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. పూజిత తండ్రి వినుకొండ పట్టణంలో చిరు ఉద్యోగి, తల్లి వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో సీనీ నటుడు, ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు, మేనేజింగ్ ట్రస్టీ బొల్లు వెంకటేశ్వర్లు, సభ్యులు మర్లపాటి రామకృష్ణ, మక్కెన పున్నయ్య, మధు పాల్గొన్నారు.

## వృద్ధురాలిని కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు

చిలకలూరిపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బస్సు మిస్ అయి దిక్కు తోచని స్థితిలో ఉన్న ఒక వృద్ధ మహిళను చిలకలూరిపేట రూరల్ పోలీసులు శనివారం రాత్రి ఆదుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా గొల్లపాలెం గ్రామానికి చెందిన గోపిశెట్టి గోగులమ్మ తన తమ్ముడు ఆరోగ్యం బాగోకపోవడంతో పరామర్శించడానికి నరసరావుపేట మీదగా కర్ణాటక వైపు వెళ్లడానికి బస్సు ఎక్కింది. యూరినల్స్ కోసం మధ్య లో బస్సు దిగింది. తిరిగి బస్సు ఎక్కకపోవడంతో ఆమె ఎటు వెళ్లాలో తెలియక నరసరావుపేట వైపు నుంచి చిలకలూరిపేట వైపు నడుచుకుంటూ వచ్చింది. కోమటినేనివారిపాలెం గ్రామం వద్ద అక్కడ ఉన్న వారు చూసి 100కు కాల్ చేసి సమాచారం తెలిపారు. రూరల్ ఎస్‌ఐ జి.అనిల్‌కుమార్ స్పందించి ఆమెను ఆమెను పట్టణంలోని వృద్ధుల ఆశ్రమం చేర్పించారు. అనంతరం వివరాలు తెలుసుకుని తూర్పు గోదావరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆమె కుమారుడు వీర వెంకట సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. ఆయన ఇక్కడకు వచ్చి రూరల్ పోలీసులను సంప్రదించి వృద్ధురాలిని తీసుకొని వెళ్లారు.

# గుంతలు లేని రోడ్లు.. అంతరాయం లేని బస్సులు నడపడమే లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- వినుకొండలో మూడు కొత్త బస్సులు..
- ఆరు నెలల్లో 20 బస్సులు ప్రారంభం


వినుకొండ నుంచి విజయవాడకు మూడు కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, ఎంపీ కృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు.. ప్రజలకు అంతరాయం లేని ఆర్టీసీ సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని మూడు కొత్త బస్సులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లడుతూ 5నెలల్లో వినుకొండ డిపో నుంచి 20కి పైగా కొత్త బస్సులను ప్రారంభించామని, రాష్ట్రవ్యాప్తంగా 300లకు పైగా కొత్త సర్వీసులు నడుస్తున్నాయన్నారు. రూ.18కోట్లతో కొత్త బస్టాండ్ కట్టాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి రాంప్రసాదరెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారన్నారు. జగన్ పాలనలో రూ.10.05లక్షల కోట్లు అప్పుచేసి గుంతలు కూడా పూడ్చలేదని, డొక్కు బస్సులతో ప్రజలను తిప్పలు పెట్టారని ఎద్దేవ చేశారు. బస్సులను పట్టించుకోకపోగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వంలో విలీనం పేరిట మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో రాష్ట్రవ్యాప్తంగా గుంతలు పూడ్చడానికి రూ.900 కోట్లు కేటాయించి నిధులు విడుదల చేశారని, పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. సంక్రాంతి పండుగ నాటికి రోడ్లపై ఎక్కడ గుంతలు కనిపించవని తెలిపారు. కళాశాలలకు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసులు నడపాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. భవిష్యత్తులో మరికొన్ని కొత్త బస్సులను వినుకొండకు తీసుకువస్తారని, ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండి తమను ముందుకు నడపాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డిపో మేనేజర్ నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠ

వినుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని మతాలకు గౌరవం లభిస్తుందని, వైసీపీ హయాంలో ఆలయాలపై దాడులు చేసినా పట్టించుకోని ఫలితంగానే ఆ అసమర్థ, దోపిడీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వెల్లటూరు రోడ్డులోని కొండ వద్ద నూతనంగా నిర్మించిన అంకాళమ్మ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జివితోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రభుత్వ ఆస్తులతోపాటు దేవదాయ, వక్ఫ్‌బోర్డు, క్రైస్తవ మిషనరీ ఆస్తులను కాపాడే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్నారన్నారు. త్వరలో అమ్మవారి దేవాలయానికి వచ్చే విధంగా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సీసీరోడ్లు నిర్మిస్తామని అన్నారు. కూటమి నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొని భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఘనంగా జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు

- మొదటి బహుమతి వేటపాలెం టీమ్.. రెండో బహుమతి సత్తెనపల్లి టీమ్ కైవసం


రెండో బహుమతి అందుకుంటున్న సత్తెనపల్లి టీమ్

వినుకొండటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): టీవీలకే పరిమితమైన క్రికెట్ గ్రామస్థాయికి చేరి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అందిస్తుందని పీపుల్స్ ట్రామా ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టరు కేసరి వెంకటేశ్వరరెడ్డి (న్యూరోసర్జన్) అన్నారు. మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలోని సాయిబాబా దేవస్థానం వద్ద వినుకొండ ప్రీమియర్ లీగ్ (వీపీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు ఉత్సాహభరితంగా సాగిన ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన కోటి ఫ్రెండ్స్ టీమ్ మొదటి బహుమతి లక్ష రూపాయల నగదుతోపాటు కప్పును చేజిక్కించుకున్నారు. సత్తెనపల్లికి చెందిన పల్నాడు ఓవర్‌సెస్ టీమ్ రూ.75వేలు విలువచేసే రెండో బహుమతి, నరసరావుపేటకు చెందిన జేడీఎం ఆర్‌సీసీకి చెందిన టీమ్ రూ.50వేలు విలువచేసే మూడో బహుమతిని కైవసం చేసుకున్నారు. అదేవిదంగా ప్రతిభ కనపర్చిన బోలర్, బ్యాట్స్‌మెన్‌లకు రూ.5వేలు విలువచేసే ప్రత్యేక నగదు ప్రోత్సాహకంతో అభినందించారు. డాక్టర్ కేసరి వెంకటేశ్వరరావుతోపాటు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనివిధంగా పోటీలను విఠంరాజుపల్లిలో నిర్వహించడం గర్వంగా ఉందని, రానున్న రోజుల్లో క్రీడాకారులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు జానారెడ్డి, పేరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏరువ ఈశ్వరరెడ్డి, ఏరువ సుబ్బరామిరెడ్డి, వజ్రాల నవీన్‌రెడ్డి, మక్కెన మహేష్, అయ్యప్పరెడ్డి, గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లు లీజుదారుడిపై కేసు

వినుకొండటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలోని పిచికలపాలెం వెళ్లే ప్రధాన రహదారి వద్ద ఉన్న తిరుమల రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వ ఉంచిన మిల్లు లీజుదారుడు నరేంద్రపై సీఎస్‌డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈ నెల 3వ తేదీన ఇన్‌చార్జి డీఎస్‌వో నారదముణితోపాటు తహసీల్దార్ సురేష్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసి సుమారు 235 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి పరీక్షలకు పంపారు. పరీక్షల్లో రేషన్ బియ్యం అని తేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సీఎస్‌డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

## వైసీపీ నేత కోటిరెడ్డిపై పోర్జరీ కేసు

నాదెండ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డిపై నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. 2013 వరకు చిరుమామిళ్ళ వీఆర్‌వోగా పనిచేసిన బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. 2022లో తాను నకరికల్లు మండలంలో వీఆర్‌వోగా పనిచేస్తుండగా తాను ఇచ్చినట్టుగా కోటిరెడ్డి పోర్జరీ సర్టిఫికెట్ సృష్టించి చెరువు స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశాడని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగినైన తన పేరుతో పోర్జరీ సర్టిఫికెట్ సృష్టించిన అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# వరికపూడిశెల ఎత్తిపోతలకు నిధులు కేటాయించాలి

- పల్నాడులో మిర్చి యార్డు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

నరసరావుపేటటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించాలని, పల్నాడు ప్రాంతంలో మిర్చి యార్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం నరసరావుపేటలో జరుగుతున్న సీపీఎం పల్నాడు జిల్లా 25వ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే పల్నాడు జిల్లా అన్ని విధాలుగా వెనుకబాటుతనానికి గురైందన్నారు. 2010లో అప్పటి ముఖ్యమంత్రి కే రోశయ్య మాచర్ల ప్రాంతంలో మిర్చియార్డు నిర్మాణానికి, యడ్లపాడు టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని అన్నారు. శిలా ఫలకాలు శిథిలావస్థకు చేరాయన్నారు. పల్నాడు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనువైన భూములు, వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో మిర్చి ఎక్స్‌పోర్టు జోన్, విమానాశ్రయం, ఫార్మాస్యూటికల్స్ హబ్, ఎలక్ట్రానిక్స్ ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా కేంద్రంలో పీజీ సెంటర్ ఏర్పాటు, వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సభకు గుంటూరు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీహెచ్ బాబూరావు, ఏపూరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదబ్రాహ్మణులకు బియ్యం, నూతన వస్త్రాల పంపిణీ


పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు పీవీ సురేష్

వినుకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణసేవా సమితి అధ్యక్షుడు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలను తెలుగుదేశంపార్టీ నాయకుడు పీవీ సురేష్ చేతులమీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవడం శుభపరిణామమని, కొన్ని సంవత్సరాలుగా వారు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో రాఘవేంద్రరావు, మల్లికార్జున శాస్త్రి, శ్రీనివాసచార్యులు, మల్లీశ్వరశాస్త్రి, హనుమంతరావు, సుదర్శనశర్మ, నారాయణరావు, విశ్వనాథశాస్త్రి, భద్రయ్యలతోపాటు శివ, హనుమంతు, శేఖర్, అప్పరాజు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రవికుమార్, గాలి శ్రీనివాస్, భవాని శంకర్, సుబ్బారావులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం అందుకున్న వాగిచర్ల తన్మయి, ముప్పాళ్ళ శ్రీకర్‌లను ఘనంగా సన్మానించారు.

# ఎన్ఈసీలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం


వాలీబాల్ టోర్నమెంట్‌లో తలపడుతున్న జట్లు

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో పాల్గొంటే అద్భుత విజయాలు సాధించవచ్చని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ 37 అనుబంధ కళాశాలల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డాక్టర్ బీపీ రాజు (సెక్రటరీ, ఐసీటీ, జేఎన్‌టీయూకే), డాక్టర్ ఏ రామచంద్రరాజు (ఎక్స్‌టర్నల్ సెలక్షన్ కమిటీ మెంబర్, జేఎన్‌టీయూకే), కే వెంకట్రావు (ఇంటర్నల్ అబ్జర్వర్ కమిటీ మెంబర్), ఎన్‌ఈసీ ఫిజికల్ డైరెక్టర్ ఎల్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కబడ్డీ జట్టుకు ఈశ్వర్ ఇంజనీరింగ్ విద్యార్థిని

నరసరావుపేటటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని పీ చందన జేఎన్‌టీయూ కాకినాడ మహిళా కబడ్డీ జట్టుకు ఎంపికైందని ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సెంట్రల్ జోన్‌లో ప్రతిభ కనబరచిందన్నారు. అంతర విశ్వవిద్యాలయాల సౌత్‌జోన్ పోటీల్లో భాగంగా తమిళనాడులోని అలగప్పా విశ్వవిద్యాలయంలో జరిగే పోటీల్లో చందన జేఎన్‌టీ యూ(కే) జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఎంపికైన చందనను కళాశాల చైర్మన్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ మస్తాన్ షరీఫ్, పీడీ గంగాధర్‌లు అభినందించారు.

## హెచ్‌బీఐలో సభ్యత్వం తీసుకోవాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు

చిలకలూరిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)ఆధ్వర్యంలో ఏర్పాటైన హాస్పిటల్ బోర్డు ఆఫ్ ఇండియా (హెచ్‌బీఐ)లో ఎంబీబీఎస్ వైద్యులతో నడుపబడుతున్న ప్రతి ఆస్పత్రి వారు సభ్యులుగా చేరాలని హెచ్‌బీఐ హెడ్ క్వార్టర్స్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసరాజు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ ఆదివారం కోరారు. స్థానిక సీఆర్ క్లబ్ సమావేశపు హాల్లో జరిగిన స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ వైద్యులు తమ ఆస్పత్రులకే పరిమితం కాకుండా సామాజిక అంశాల్లో పాలు పంచుకోవాలని అన్నారు. కనీసం వారి సొంత గ్రామాలనైనా దత్తత తీసుకుని వైద్య సదుపాయం అందని పేదలకు ఉచిత వైద్యం అందించాలని కోరారు. డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రులు హెచ్‌బీఐలో సభ్యులుగా చేరాలని, తద్వారా ప్రభుత్వం ఇచ్చే రాయితీలతో పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. సమావేశానికి స్థానిక ఐఎంఏ అధ్యక్షుడు డా.ముద్దనరమేష్ బాబు అధ్యక్షత వహించారు. హెచ్‌బీఐ రాష్ట్ర కార్యదర్శి డా.ముప్పాళ్ళ హనుమంతరావు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మక్కెన వంశీకృష్ణ, రాష్ట్ర నాయకులు డాక్టర్ కిషోర్, సీనియర్ వైద్యులు కందిమళ్ళ జయమ్మ, కొమ్మినేని వీర శంకర్రావు, మధులతలతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు


విజేతలతో టీటీడీ హిందు ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): గీతాజయంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని కుసుమ హరనాథ్ కల్యాణమండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 6, 7 తరగతుల చిన్నారుల విభాగంలో ముగ్గురు, 8, 9 తరగతుల చిన్నారుల విభాగంలో ముగ్గురు, అలాగే 700 శ్లోకాలు కంఠస్థం చేసిన వారిలో ముగ్గురు విజేతలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.1000 నగదు, రెండో బహుమతిగా రూ.750, మూడో బహుమతిగా రూ.500 అందజేసినట్లు తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త అమ్ముడు, అయినవోలు సాంబశివరావు, రెడ్డి హరినాథ్ బాబు, అత్తలూరి సుబ్బారావు, ఈశ్వర రెడ్డి, పెరుమాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 14న మైనర్ ఇరిగేషన్ సాగు నీటిసంఘం ఎన్నికలు

రొంపిచర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల ఈస్ట్, వెస్ట్‌కు సంబంధించి ఈనెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ కిరణ్ తెలిపారు. విప్పర్ల ఈస్ట్ పరిధిలో 467, విప్పర్ల వెస్ట్ పరిధిలో 306 ఓట్లు ఉన్నాయన్నారు. ఎక్కడ నిర్వహించేది ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జరుగుతాయన్నారు. 11వ తేదీన నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించినప్పుడే వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుం దని ఎన్‌టీఆర్ సు జల ప్లాంట్‌ను ప్రా రంభిస్తున్న ఎమ్మె ల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పురుషోత్తపట్నంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎన్‌టీఆర్ సుజల స్రవంతిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ద్వారా సురక్షిత మంచినీటిని రెండు రూపాయలకే 20 లీటర్లు ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో స్థానిక అవినీతి మంత్రి నిర్వహకాల కారణంగా నిలిచిపోయిన పథకాన్ని తాము మరలా ప్రారంభించటం ఎంతో సంతోషంగా ఉందన్నా రు. గత ప్రభుత్వ అలసత్వం.. వేరే వారికి పేరు రాకూడదన్న కుళ్లు రాజకీయం కారణంగా చెరువు వద్ద ఉన్న ఎన్‌టీఆర్ ప్లాంట్ మూతపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎలా పోయినా నాకేంటి? అనే రీతిలో ఎన్నికల కు ఆరునెలల ముందే నియోజకవర్గాన్ని వదిలేసి వెళ్లిపోయిన మాజీమంత్రి మరలా ఏ ముఖం పెట్టుకొని ఇక్కడకు వస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. ప్రజలు ప్రతి సారి మోసపోరని, ఒక్కసారి మీకు ఓటు వేసినందుకు నియోజక వర్గ ప్రజలకు తగిన గుణపాఠం నేర్పిన మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరని ఆయన తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు ప్రజల దాహార్తిని గమనించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందినప్పుడే వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందనే లక్ష్యంతో ఎన్‌టీఆర్ సుజల స్రవంతిని ఆవిష్కరించారన్నారు. త్వరలో ఈ పథకం పూర్తి స్థాయిలో పునఃప్రా రంభించి పట్టణ, పరిసర ప్రజ లందరూ సురక్షితమైన మంచి నీటిని వినియోగించుకొనేలా చర్యలు తీసుకుంటా మని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజారమేష్, అచ్చుకోల విజయభాస్కర్, తోట బ్రహ్మస్వాములు మిరియాల రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో 1978 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

యడ్లపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడులో గల లూథరన్ ఉన్నత పాఠశాల 1977-78లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులంతా ఒక చోట చేరి ఒకరి యోగ క్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులను తీసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు జోసఫ్ మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల క్రితం పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు తమను గుర్తు పెట్టుకుని ఆహ్వానించి సత్కరించడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. పూర్వ విద్యార్థిని అనూరాధ మాట్లాడుతూ ప్రస్తుతం తాను ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నానని, తన ఉన్నతికి కారణం తనకు చదువు చెప్పిన గురువులేనన్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. కార్యక్రమాలను పూర్వ విద్యార్థులు వైవీ రమణమూర్తి, పుసులూరి రంగాచార్యులు, ఆలోకం హరిబాబులు పర్యవేక్షించారు. పూర్వ విద్యార్థిని పి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యాయులు వినతి, కృపావరం, మాజీ ఎంపీపీ వి.రాజారావు, పూర్వ విద్యార్థులు పోపూరి నాగేశ్వరరావు, శివాంజనేయులు, పుణ్యవతి, సుబ్బరావమ్మ, సామ్రాజ్యం, సుబ్బరామమూర్తి, వెంకటేశ్వర్లు, కేఎస్‌ఆర్ ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన

రొంపిచర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో శనివా రం రాత్రి డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ అశోక్‌లు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలు కావద్దన్నారు. సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ మోసాలపై ఆయన వివరించా రు ద్విచక్ర వాహనాలపై పోటీలు పడి యువకులు నడుపుతున్నారని, ఆ విధంగా చేయ వద్దన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, యాప్‌లతో జాగ్రత్తలు వహించాలన్నారు. ఇటీవల చర్చి విషయంలో ఘర్షణ జరిగిన నేపథ్యంలో ఇరువర్గాలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గొడవలకు పాల్పడి ఇబ్బందులను తెచ్చుకోవద్దన్నారు. శాంతి కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు.